
క్లుప్తంగా

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ


కూరగాయలు పంపిణీ చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరురూరల్: గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్.ఆర్.ప్రావిజన్స్ అధినేత ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి నెలా మూడో ఆదివారం దివ్యాంగులకు ఉచితంగా కూరగాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీష్, జేవీవీ ప్రతినిధులు చెంచునారాయణ, రామ్మోహన్‌రావు, విజయ్‌బాబు, కటకం శ్రీనివాసులు, రాధయ్య, మురళీసింగ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోనలో 25న వరలక్ష్మీ వ్రతం


పెంచలకోన దేవస్థానం

రాపూరు: పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి అమ్మవారిని ఈ నెల 25వ తేదీ సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. వ్రతంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి ప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, ప్రసాదాలు, గాజులు అందజేస్తామన్నారు. అలాగే రాపూరు సమీపంలోని మద్దెలమడుగులో ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయంలో 25వ తేదీ సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తడలో కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తడ: పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో తడలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక బీసీ హాస్టల్‌లో స్థానికులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారిని గుర్తించి ట్రస్ట్ సొంత ఖర్చుతో తిరుపతి ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని ట్రస్ట్ ఫౌండర్ గౌరీ శంకర్ తెలిపారు.

పోలేరమ్మకు పూజలు


పోలేరమ్మకు పూజలు చేస్తున్న కౌన్సిలర్లు

వెంకటగిరిరూరల్: పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడాన్ని పురస్కరించుకుని 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి, రాజారెడ్డి ఆదివారం ఆ వార్డులోని పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, వైస్ చైర్మన్ చింతపట్ల ఉమామహేశ్వరి, పార్టీ నాయకులు ఢిల్లీబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం


శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాళహస్తి ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు ఆలయంలో పలు హోమాలు, అభిషేకం, స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కేకుల తయారీపై మహిళలకు శిక్షణ

తిరుపతి కల్చరల్: అఖిల భారత మహిళా వ్యాపారవేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో అత్యధిక పోషక విలువలుగల తృణధాన్యాలతో కేకులు, కుకీస్ తయారీ విధానంపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌రాజు తెలిపారు. ఎంఆర్‌పల్లిలోని బేకర్స్ బై బాక్స్‌లో సోమ, మంగళవారం శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయభేరి

- పంచాయతీ ఉప ఎన్నికల్లో ఘన విజయం
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం


గిరిజ, కొండాపురం, వాకాడు మండలం; పుల్లమ్మ, కేశవరం, కోట; శ్రీలక్ష్మి, మెట్టు, చిట్టమూరు; పెంచలయ్య, చేడిమాల, చిల్లకూరు

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఘన విజయం సాధించారు. గూడూరు రూరల్, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఒక్కో వార్డు, కోట మండలంలో రెండు వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో చిల్లకూరు మండలం చేడిమాల, చిట్టమూరు మండలం మెట్టు పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. చిల్లకూరు మండలం చేడిమాల పంచాయతీ రెండో వార్డులో పొల్లూరు పెంచలయ్య, చిట్టమూరు మండలం మెట్టు గ్రామంలోని 5 వార్డులో ఎస్. శ్రీలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాకాడు మండలం కొండాపురం ఏడో వార్డులో మల్లి గిరిజ గెలుపొందారు. కోట మండలం కేశవరం పంచాయతీ 5వ వార్డులో ఉల్లిపాయల పుల్లమ్మ విజయం సాధించారు. కాగా గూడూరు రూరల్‌లోని తిమ్మసముంద్రం, కోట మండలం ఉత్తమ నెల్లూరు పంచాయతీల్లో గతంలో గెలుపొందిన అభ్యర్థులు మృతి చెందిన కారణంగా మానవతాథృక్పథంతో వైఎస్సార్‌సీపీ తమ అభ్యర్థులను పోటీలో నిలపలేదు.

సూళ్లూరుపేటలో అన్నీ ఏకగ్రీవాలే


పొన్నా ప్రసన్న, కేసీఎన్ గుంట, సూళ్లూరుపేట; మల్లికార్జున్, రావిపాడు, ఓజిలి; రఘురామిరెడ్డి, కురుగొండ, ఓజిలి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఐదు పంచాయతీల్లోనూ ఏకగ్రీవంగానే ఎన్నికయ్యాయి. ఇదింటిలో మూడు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఇద్దరు మాత్రమే టీడీపీ సభ్యులు ఎన్నికయ్యారు. ఓజిలి మండలం రావిపాడులో యారమాక మల్లికార్జున్, కురుగొండ పంచాయతీలో గెడి రఘురామిరెడ్డి, సూళ్లూరుపేట మండలం కేసీఎన్‌గుంట పంచాయతీలో పొన్నా ప్రసన్న వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయుడుపేట మండలం గొట్టిప్రోలులో వార్డు మెంబర్ తాటిపర్తి పండయ్య మృతి చెందడంతో ఆయన భార్య రమణమ్మ నామినేషన్ వేసింది. మానవతాథృక్పథంతో దీన్ని వైఎస్సార్‌సీపీ వదిలేసింది. పూడి పంచాయతీ ఆరో వార్డుకు కె.కుమార్ ఎన్నికయ్యారు. ఇక్కడ కూడా వైఎస్సార్‌సీపీ దూరంగా ఉంది.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం


ఆదెమ్మ, గోనుపల్లి, రాపూరు; రాజగోపాల్‌రెడ్డి, గిలకపాడు, రాపూరు

రాపూరు: రాపూరు మండలంలో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. గోనుపల్లి 12వార్డులో ఆదెమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గిలకపాడు పంచాయతీ 3వార్డుకు, బొజ్జనపల్లి 8వార్డుకు ఉప ఎన్నికలు జరిగాయి. గిలకపాడులో వైఎస్సార్ సీపీ మద్దుదారుడు చల్లా రాజగోపాల్‌రెడ్డి 42 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బొజ్జనపల్లి 8వ వార్డులో రమణమ్మ గెలుపొందారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గూడూరురూరల్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గూడూరు పాతబస్టాండ్ వద్దనున్న టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానిగా రాజీవ్‌గాంధీ ఎన్నో సేవలందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు తాజుద్దీన్, చిల్లకూరు వేమయ్య, అరవ పార్వతయ్య, నాగభూషణం, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

గీతా మందిరానికి విరాళం

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామంలోని గీతా మందిరానికి నెలబల్లి గ్రామానికి చెందిన రామకృష్ణా, శ్రావణి దంపతులు రూ.5 వేలు, శ్రీకృష్ణుడి విగ్రహం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణా ఫౌండేషన్ సంస్థ సభ్యులు నాగరాజు, సుందరయ్య స్వామి పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం

కోట: ఆటోకార్మికుల యూనియన్ మహా సభను విజయవంతం చేయాలని సీఐటీయూ గూడూరు డివిజన్ కార్యదర్శి బీవీ రమణయ్య కోరారు. తిరుపతి జిల్లా యూనియన్ మహాసభ ఈ నెల 27వ తేదీ శ్రీకాళహస్తిలో జరగనుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం కోటలో యూనియన్ నాయకులు మహా సభ కరపత్రాలు విడుదల చేశారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి హరనాథ్, రమణయ్య, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

సూళ్లూరుపేట: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ తులసీ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం కోటపోలూరు శివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. కోటపోలూరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కామిరెడ్డి ఆదిశేషారెడ్డి, కార్యదర్శి జెట్టి శ్రీనివాసులు, కోశాధికారి అప్పారావు, క్యాంప్ చైర్మన్ రాధాకృష్ణరావు, బద్దెపూడి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 15.388 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నా టికి 15.388 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 900 క్యూ సెక్కులు, పిన్నేరు వాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు 80, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వేడుకగా దగ్గవోలు తాళ్లమ్మ కొలుపు


గ్రామదేవత తాళ్లమ్మ


పురవీధుల్లో ఊరేగుతున్న ఉత్సవ విగ్రహాలు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామదేవత తాళ్లమ కొలుపు శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి తాళ్లమ్మ ఉత్సవ విగ్రహంతో పాటు చిన పోతురాజు, పెద పోతురాజు, పరుశురామయ్య విగ్రహాలను గ్రామ చావిడి వద్ద కొలువుదీర్చారు. అనంతరం పుర వీధుల్లో ఊరేగించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష అలంకరణలో ప్రతిష్ఠించారు. గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు: ఇరవైదు సంవత్సరాల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. తాము చదువుకున్న తిక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 1998లో పది చదివిన విద్యార్థులు అటు తరువాత కొంత మంది ఉన్నత చదువులు చదువుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లగా కొందరు మండలంలోనే ప్రజాప్రతినిధులుగా, వ్యాపారవేత్తలుగా, రైతులుగా స్థిరపడ్డారు. వీరంతా సిల్వర్ జూబ్లీ సందర్భంగా కలుసుకునేందుకు మరాల తిక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పటి, ఇప్పటి హెచ్ఎంలు సుబ్బరాయులు, రమణకుమార్, తామకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు రాజు, సందానీ, శ్రీనివాసులు, శారదను సన్మానించారు.

ఎన్నిక ఏదైనా వైఎస్సార్‌సీపీదే విజయం


మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

దక్కిలి: మండలంలో ఏ ఎన్నిక జరిగినా వైఎస్సార్‌సీపీదే విజయమని ఎంపీపీ జి.రాజశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం డక్కిలిలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలకు చూపుతున్న పరిష్కారం కారణంగా భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా డక్కిలి మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యమన్నారు. మండల రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు తొలగించేలా రూ.550 కోట్లతో ఆల్తూరుపాడు ప్రాజెక్ట్ పనుల ప్రారంభానికి సీఎం హామీ ఇవ్వడం, వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రకటన చేయించిన రామ్‌కుమార్‌రెడ్డికి వెంకటగిరి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఆల్తూరుపాడు, దందవోలు, శ్రీపురం పంచాయతీల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. వారి విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మస్తాన్‌రెడ్డి, సర్పంచ్‌లు చిరంజీవి, డీపీ యాదవ్, దగ్గవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు ఘట్టమనేని శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ మాదమాల నారాయణరెడ్డి, కోళ్లపూడి వేణుగోపాల్, మార్లగుంట వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, పాదిలేటి బలరామిరెడ్డి, వార్డు సభ్యుడు మురళి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ క్రికెట్ లీగ్ జెర్సీల ఆవిష్కరణ


టీసీఎల్ జెర్సీలను ఆవిష్కరిస్తున్న ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు

గూడూరురూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25,26,27 తేదీల్లో టీచర్స్ క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మూడు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. టోర్నీకి సంబంధించి ఆయా జట్ల జెర్సీలను ఆదివారం స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. టీసీఎల్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి జట్లు పాల్గొంటాయని తెలిపారు. సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు పీడీ కరిముల్లాఖాన్, కోట వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఉపాధ్యాయులు మురళీసింగ్, బాబర్, చంద్రశేఖర్, మణి, సతీష్ పాల్గొన్నారు.

వేడుకగా లక్ష కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు, మాతాపరమేశ్వరి అమ్మవారు

దొరవారసత్రం: పాళెంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మాతాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ

- ఏపీ దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ బీరక సురేంద్రబాబు


సురేంద్రబాబును సత్కరిస్తున్న దేవాంగ సంఘం ప్రతినిధులు

సూళ్లూరుపేట: రాష్ట్రంలో చేనేత కార్మికుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా వంద యూనిట్ల విద్యుత్‌ను సబ్సిడీ కింద ఇస్తున్నారని రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు అన్నారు. సూళ్లూరుపేట పురపాలక సంఘం పరిధిలోని మన్నారు పోలూరులో చేనేత కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి నేతన్న నేస్తం కింద ఆర్థికంగా ఆదుకుంటున్నామని తెలిపారు. మన్నారుపోలూరు మాదన తిరుపాల్ కుమార్తె అనారోగ్యం విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. రాష్ట్ర దేవాంగసంఘం రూ.3 లక్షలు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. స్థానిక దేవాంగ సంఘం నేత సురేంద్రబాబును సత్కరించారు. అనంతరం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వార్డు కౌన్సిలర్‌లు ఉమ్మిటి రమ్య, పముజుల విజయలక్ష్మి, మన్నెముద్దు పద్మజ, ఉమ్మటి జానీ, దేవాంగసంఘం నాయకులు గుత్తి త్యాగరాజు, శ్రీనివాసులు, సీతా చెంచుకృష్ణ, జక్కల నాగేంద్ర, చెంచయ్య, జయచంద్ర, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ గ్రామోత్సవం


ఎల్లమ్మ పంచలోహ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ బాలాలయ మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి పంచలోహ విగ్రహానికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు అవాహిత కలశ పునపూజలు, 3.55 గంటలకు కర్కాటక లగ్నంలో అమ్మవారి దారు ప్రతిష్ఠ, పంచలోహమూర్తి చర ప్రతిష్ఠ, కుంభ కళాన్యాసం, మార్జనలు, నేత్రోన్మీలనం, గో, దర్ప, కన్యా, సర్వదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు 0877–2227208కి కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే 10:30 నుంచి నేరుగా అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.


గంగ జాతర సందర్భంగా రేణిగుంటలో విద్యుత్ వెలుగులు


రేణిగుంట గంగమ్మ ఆలయం (ఇన్‌సెట్) గంగమ్మ తల్లి మూలవిరాట్

రేణిగుంటలో జాతర సంబరం

రేణిగుంట: మండలకేంద్రం రేణిగుంటలో గంగ జాతర మూడు రోజులపాటు వైభవంగా జరగనుంది. సోమవారం ఉదయం గెరిగె ఊరేగింపు, మంగళవారం గంగమ్మ జాతర మహోత్సవం, గంగమ్మ ఆలయం ప్రాంగణంలో సామూహిక పొంగళ్లు, నైవేద్యం సమర్పణ, నడివీధి గంగమ్మ ఎదుట అంబళ్లు, అమ్మవారి మూలవిరాట్ విశ్వరూప దర్శనం ఏర్పాట్లు జరగనున్నాయి. బుధవారం నడివీధి గంగమ్మ ఎదుట అమ్మవారి ప్రతిష్ఠ, అమ్మవారి మహా దర్శన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివస్తారు. ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు.